

ఆర్టీసీలో అప్రంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లో అప్రంటీస్‌కు ఐటీఐ పాసైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.విజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 20వ తేదీ నుంచి 31 లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నవంబరు 7న ఒరిజినల్ ధ్రువపత్రాలతో విజయనగరంలోని ఆర్టీసీ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలకు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 08942-294906 నెంబరును సంప్రదించాలని సూచించారు.

ప్రమాదమని తెలిసినా.. ఆపరేషన్!



- నమ్మకాలతో అమ్మతనానికి కోత!
- జాతకాల పేరిట ముందస్తు ప్రసవాలు
- ముహూర్తాలు చూసుకుని శస్త్రచికిత్సలు
- తల్లీ బిడ్డల ఆరోగ్యానికి శాపం

స్త్రీకి మాతృత్వం దేవుడిచ్చిన వరం. బిడ్డకు జన్మనివ్వడం స్త్రీకి పునర్జన్మగానే చెప్పవచ్చు. సాధారణ ప్రసవం తల్లీబిడ్డ ఆరోగ్యానికి మంచిది. కాగా.. ప్రస్తుత ఆధునిక పోకడలతో కొంతమంది మూఢనమ్మకాలు, జాతకాల పేరిట ముహూర్తం చూసి.. ముందస్తు ప్రసవాలకు మొగ్గు చూపుతున్నారు. తల్లీ, బిడ్డ ఆరోగ్యానికి ప్రమాదమని తెలిసినా.. ఆపరేషన్లు చేయించేస్తున్నారు. తల్లి కడుపులో నవమాసాలు ఉండి శరీర ఎదుగుదలతో భూ ప్రపంచంలోకి అడుగుపెట్టాల్సిన శిశువులు.. అరకొర ఆరోగ్యంతోనే బయటకు వస్తున్నారు. అంతిమంగా అటు తల్లికి, ఇటు శిశువుకు అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.

రణస్థలం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి)

- జే.ఆర్.పురం గ్రామానికి చెందిన ఓ కుటుంబానికి విపరీతమైన జాతకాల పిచ్చి. ఇంట్లో ఇటీవల ఓ గర్భిణీ ప్రసవించింది. అయితే కుటుంబ పెద్ద పట్టుపట్టి మరీ ఎనిమిదో నెలలోనే మంచి ముహూర్తాలు ఉన్నాయని చెప్పడంతో.. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆ గర్భిణీకి ఆపరేషన్ చేసి ప్రసవం చేయించారు.

- పైడిభీమవరానికి చెందిన ఓ యువకుడికి విపరీతమైన దేశభక్తి. ఇటీవల ఆయన భార్య గర్భం దాల్చింది. అయితే పుట్టే పిల్లాడికి మహనీయుల పేరు పెట్టాలన్న ఉద్దేశంతో ఆగస్టు 15న ముహూర్తం నిర్ణయించి ఆపరేషన్ చేసి.. ప్రసవం చేయించారు.

- లావేరుకు చెందిన ఓ యువకుడు పూర్వీకుల పేరు నిలబెట్టాలని భావిస్తుంటాడు. తాత ముత్తాతలను ఆదర్శంగా తీసుకుంటాడు. అయితే తన భార్య గర్భం దాల్చడంతో తన తాత, నానమ్మ పెళ్లిరోజున భార్యకు ప్రసవం చేయించాలని చూశాడు. పురిటి నొప్పులు రాకుండానే భార్యకు ఆపరేషన్ ద్వారా ప్రసవం చేయించాడు.

..ఇలా జాతకాలు, లేనిపోని నమ్మకాలతో అమ్మతనానికి కోత విధిస్తున్నారు. చాలా మంది సాధారణ ప్రసవం కోసం ఎదురుచూడకుండా.. ముందస్తు ప్రసవాల వైపు మొగ్గు చూపుతున్నారు. ముందుగానే బ్రాహ్మణుల వద్దకు వెళ్లి పలానా రోజు మంచిది అంటూ ముహూర్తాలు నిర్ణయిస్తున్నారు. ఆగస్టు 15, జనవరి 1 వంటి పర్వదినాల నాడు ప్రసవాలు చేయించిన వారూ ఉన్నారు. పెద్దల పేరిట సెంటిమెంట్ అని ఒకరు.. చనిపోయిన పూర్వీకుల పుట్టినరోజు అని మరొకరు.. ఇలా ప్రతిఒక్కరూ ఆపరేషన్ల ద్వారా ముందస్తు ప్రసవాలు చేయించేస్తున్నారు. కాసుల కక్కుర్తి పడిన వైద్యులు సైతం ప్రసవాలు కోసం వెళ్తున్న వారి మైండ్‌లో ఏవేవో ఆలోచనలు పెడుతున్నారు. దీంతో కుటుంబ సభ్యులు సైతం సుఖ ప్రసవాలు అన్న విషయాన్నే మరిచి పోతున్నారు. పేరుకే ప్రభుత్వాస్పత్రుల్లో సుఖ ప్రసవాలని చెప్పుకొస్తున్నారు. దీనిని ప్రచార ఆర్భాటం చేసేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో గత మూడేళ్లలో సాధారణ ప్రసవాలు పది వేలకు మించి జరగలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గర్భిణీలకు తొలి నెల నుంచీ వారి ఆరోగ్య పరిస్థితిని ఆశా కార్యకర్తలు పరిశీలించాలి. ఎప్పటికప్పుడు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో పరీక్షలు చేయించాలి. హైరిస్క్ కేసులను ముందుగానే గుర్తించి పెద్దాస్పత్రులకు రిఫర్ చేయాలి. కానీ జిల్లాలో ఇవేవీ సక్రమంగా జరిగిన దాఖలాలు లేవు. శని, ఆదివారాలు వస్తే చాలు ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు కనిపించడం లేదు. దీంతో చాలామంది ఆర్థిక భారమైనా (మిగతా 6వ పేజీలో)

అది చాలా తప్పు..



జననాన్ని నిర్దేశించేవాడు భగవంతుడు. సృష్టికర్త బ్రహ్మ. దానిని మనమెలా నిర్దేశిస్తాం. తల్లి కడుపులో నవ మాసాలు మోసి.. భూమిపై అడుగుపెట్టేది దివ్యమైన ముహూర్తం. కానీ మనం పెట్టే ముహూర్తం నాడు ప్రసవం చేయించడం ముమ్మాటికీ నేరం. పుణ్యం, పురుషార్థం, భవిత ఉంటుందని భావించడం భ్రమే. జ్యోతిష్య శాస్త్రంలో అటువంటి వాటికి స్థానం లేదు.

-బాలకృష్ణశర్మ, జ్యోతిష్య పండితులు గిరువానిపాలేం, రణస్థలం

తల్లీ బిడ్డలకు ప్రమాదం..



ముందస్తు ప్రసవం అనేది తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రమాదం. ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప.. ముందస్తు ముహూర్తాలు ప్రసవాలు చేయించడం నేరంగా పరిగణిస్తారు. వీలైనంత వరకూ సాధారణ ప్రసవాల కోసం ఎదురు చూడాలి. తప్పదని భావిస్తే తప్ప ఆపరేషన్ చేయకూడదు. ఈ విషయంలో ప్రజల్లో అవగాహన పెరగాలి.

-డాక్టర్ కృష్ణచైతన్య, పాతర్లపల్లి పీహెచ్‌సీ

రేపటి నుంచి పోలీసు అమరవీరుల స్మారకోత్సవాలు

న్యూస్ బాక్స్

శ్రీకాకుళంక్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల స్మారకోత్సవాలను ఈ నెల 21నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమాజంలో పోలీసుల పాత్ర, విధులు, అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేసేలా అన్ని స్టేషన్లపరిధిలో స్మారకోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. '21న జిల్లా పోలీసు కార్యాలయంలో స్థూపం వద్ద నివాళులర్పించి, అమరవీరుల కుటుంబ సభ్యులను కలుసుకుంటాం. 31వరకు ఎచ్చెర్ల పోలీసు కల్యాణ మండపంలో ఆయుధాలు, పరికరాలు, సాధనలు, సాంకేతిక ఉపకరణాలతో ఓపెన్ హౌస్ ప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తాం. సబ్‌డివిజనల్, సర్కిల్, పోలీసు స్టేషన్లలో కూడా ఓపెన్‌హౌస్ నిర్వహించనున్నాం. అమరవీరుల గ్రామాలను డీఎస్పీ స్థాయి అధికారులు సందర్శించి వారు చదివిన పాఠశాల, కళాశాలలకు వెళ్లి త్యాగవీరుల ఫొటోల వద్ద నివాళులర్పిస్తారు. ఆ గ్రామంలో ఏదైన పాఠశాల, రోడ్డు, అభివృద్ధి పనులకు వారి పేర్లు పెట్టేలా గ్రామస్థులకు సూచనలిస్తారు. సైబర్ నేరాలు అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 24న శ్రీకాకుళం, 25న కాశీబుగ్గ, 26నటెక్కలి సబ్‌డివిజనల్ పరిధిలో పలు పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తాం. పర్యావరణ పరిరక్షణలో పోలీసుల పాత్ర అన్న అంశంపై పోలీసు సిబ్బందికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు సబ్‌డివిజనల్ పరిధిలో నిర్వహించనున్నాం. 26,27న మూడు సబ్‌డివిజన్ల పరిధిలో పోలీసు దేశభక్తిని తెలిపే సందేశాత్మక చిత్రాలు ప్రదర్శిస్తాం. 28న జిల్లా పోలీసు కార్యాలయంలో, 29న టెక్కలి, 30న కాశీబుగ్గ సబ్‌డివిజన్ పరిధిలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తాం. 30న అమరవీరుల కుటుంబాల్లో ప్రత్యేక విజయాలు సాధించిన వారికి సన్మానిస్తాం. 31న శ్రీకాకుళంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమంలో భాగంగా ఉదయం యూనిట్ రన్, సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శన ర్యాలీతో అమరవీరుల స్మారకోత్సవాలు ముగుస్తాయ'ని ఎస్పీ తెలిపారు.



నిలిచిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు

ఆఫ్‌షోర్.. ఆపేస్తారా?

- 25 శాతం పూర్తికాని పనులపై నీలినీడలు
- ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ మెమో జారీ
- వైసీపీ హయాంలో ఏడు శాతమే పనులు

టెక్కలి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆఫ్‌షోర్ ప్రాజెక్టుపై మరోసారి నీలినీడలు కమ్ముకున్నాయి. సుమారు 16 ఏళ్ల కిందట ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా.. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నారు.. కానీ పనులు మాత్రం పూర్తికావడం లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కొంతమేర పనులు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో కేవలం ఏడు శాతం మాత్రమే పనులు చేపట్టింది. కాగా గత ఐదేళ్లలో అగ్రిమెంట్ ప్రకారం 25శాతం లోపు జరిగిన పనులు ఎందుకు రద్దు చేయకూడదని.. ఇటీవల ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ చావెల్ మెమో జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు ఆపేస్తారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- పలాస మండలం రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2008 ఏప్రిల్ 4న శంకుస్థాపన చేశారు. మెళియాపుట్టి, నందిగాం, వజ్రపుకొత్తూరు, పలాస మండలాల పరిధిలో 24,600 ఎకరాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో రూ.127కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. మెళియాపుట్టి, చాపర సమీపంలో మహేంద్రతనయపై ఫ్లడ్‌ఫ్లో కెనాల్ ఏర్పాటు చేసి సాగునీటిని కాలువల ద్వారా రేగులపాడు రిజర్వాయర్‌కు తరలించాలని నిర్ణయించారు. రిజర్వాయర్ నుంచి వివిధ ప్రాంతాలకు సాగునీటిని సరఫరా చేయాలనే ఉద్దేశంతో పనులకు శ్రీకారం చుట్టారు. కాగా శంకుస్థాపన చేసి 16ఏళ్లు అవుతున్నా.. పనులు పూర్తికాలేదు. 2008 నుంచి 2019 నాటికి 35శాతం పనులు పూర్తయ్యాయి. 2014-19 మధ్య టీడీపీ హయాంలో కొంతమేర పనులు ముందుకు సాగాయి. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వ (మిగతా 6వ పేజీలో...)



మాట్లాడుతున్న డీఆర్వో అప్పారావు, పక్కన డీఈవో తిరుమల చైతన్య

న్యూస్ బాక్స్

6 వరకు ఉపాధ్యాయ ఓటర్ల నమోదు

- పాత ఓటు చెల్లుబాటు కాదు
- డీఆర్వో అప్పారావు

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని డీఆర్వో ఎం.అప్పారావు తెలిపారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. 'ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి సెప్టెంబరు 30న నోటిఫికేషన్ వెలువడింది. అదేరోజు నుంచి ఉపాధ్యాయ ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. నవంబరు 6వ తేదీలోగా (మిగతా 6వ పేజీలో...)

చూడకపోతే ముప్పే

సరుబుజ్జిలి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి మండలంలోని అలికాం-బత్తిలి అంతర్రాష్ట్ర రహదారి అది. ఆ రోడ్డులో వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాలి మరి. ఈ మార్గంలో భారీ గుంతలు కనిపిస్తాయి. కల్వర్టులు కుంగి.. రోడ్డు మధ్యలో భారీ రంధ్రాలు కూడా ఉంటాయి. వాహనదారులు వాటిని గమనించకపోతే అంతేసంగతులు. రెండు నెలల కిందట కొత్తకోట సమీపాన ప్రధాన రహదారిపై కల్వర్టు కుంగి భారీ రంధ్రం పడింది. ఇంతవరకూ అధికారులు దాన్ని పూడ్చలేదు సరికదా.. హెచ్చరిక బోర్డు కూడా పెట్టలేదు. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీన్నిచూసి కొందరు స్థానికులు చెట్టుకొమ్మలను రోడ్డు మధ్య రంధ్రాల్లో పెట్టి.. వాహనదారులను అప్రమత్తం చేస్తున్నారు.



జాబ్‌కార్డులపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డుల మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం అమలు, తదితర అంశాలపై సంబంధిత అదికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం 18 ఏళ్లు నిండిన వారు రూరల్, అర్బన్ ప్రాంతాల్లో ఎంతమంది ఉన్నారని ఆరా తీశారు. మండలాల వారీగా జారీ చేసిన జాబ్ కార్డులు, నిర్దేశిత లక్ష్యాలు, ప్రగతి, గ్రామసభల నిర్వహణపై సమీక్ష నిర్వహించాలని సూచించారు. జాబ్ కార్డుల మంజూరులో ఫిర్యాదులు వస్తే సంబంధిత ఏపీఓపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. మెళియాపుట్టి, కంచిలి, ఎల్.ఎన్.పేట, ఇచ్ఛాపురం, పొందూరు, వజ్రపుకొత్తూరు ఏపీఓలు చేపట్టిన పనులను కలెక్టర్‌కు వివరించారు. వంశధార, బాహుదా, నాగావళి ఓపెన్ మెడ్ ఛానల్స్‌కి నీరు వెళ్లేందుకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

మత్స్య సంపద పథకాలు నూరుశాతం అందాలి

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాలు లబ్ధిదారులకు శతశాతం అందేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ (మిగతా 6వ పేజీలో...)



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



అబ్బురపరిచే కళారూపాలు

- గ్రానైట్‌తో చెక్కుతున్న శిల్పులు
- విదేశాల్లో మోర్నమెంట్‌కు మంచి గిరాకీ
- ఏటా రూ.కోట్లలో వ్యాపారం

6 లో

గుల్లబారుతున్న ఎముకలు

- వృద్ధులు, మహిళల్లో పెరుగుతున్న సమస్య
- నేడు వరల్డ్ ఆస్టియోపోరోసిస్ డే

6 లో

● గ్రానైట్ రాళ్లతో చెక్కుతున్న శిల్పులు
● విదేశాల్లో మోర్నమెంట్‌కు మంచి గిరాకీ
● ప్రతి ఏటా రూ.కోట్లలో వ్యాపారం

అబ్బురపరిచే కళారూపాలు




నీలిరంగు గ్రానైట్ రాళ్లలో మోర్నమెంట్ ఫ్యాక్టరీలు తయారు చేసిన వివిధ కళారూపాలు

టెక్కలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయన్నది ఒకనాటికి రత్నమవునులే అని ఓ సినీకవి చెప్పినది అక్షర సత్యంగా మారింది. జిల్లాలోని టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సారవకోట, మెళియాపుట్టి ప్రాంతాల్లో కనిపించే ఈ రాళ్లకు ప్రపంచంలో ప్రత్యేక స్థానం ఉంది. ప్రధానంగా తమిళనాడు, కర్ణాటక, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మోర్నమెంట్ ఫ్యాక్టరీల్లో నీలిరంగు గ్రానైట్ బ్లాకులతో అబ్బురపరిచే కళారూపాలు తయారుచేస్తుంటే.. వాటిని విదేశీయులు ఇట్టే కొనుగోలు చేస్తున్నారు. ప్రపంచ దేశాల్లో పోలాండ్, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, థాయిలాండ్, లండన్, రష్యా, తైవాన్, చైనా తదితర దేశాలకు చెందిన విదేశీ బయ్యర్లు వచ్చి ఈ మోర్నమెంట్లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. నీలిరంగు గ్రానైట్ క్వారీల్లో తయారుచేసే బ్లాకుల్లో 40 శాతం మోర్నమెంట్ మెటీరియల్ కాగా, మిగిలినది శ్లాబ్ మెటీరియల్‌గా వెళ్తుంది.








ప్రతి రెండేళ్లకు ఒకసారి బెంగళూరులో నిర్వహించే గ్రానైట్ స్టోనా ప్రదర్శనలో విదేశీ బయర్లు వచ్చి ఇక్కడ మోర్నమెంట్లను తిలకించి ఆయా కంపెనీలకు ఆర్డర్లు జారీచేస్తుంటారు. గ్రానైట్ క్వారీల్లో మోర్నమెంట్ బ్లాకు క్యూబిక్ మీటరు రూ.40వేల నుంచి రూ.60వేల మధ్యలో ధర పలుకుతున్నాయి. విదేశీయులు ఎక్కువగా సమాధుల నిర్మాణానికి వీటిని వినియోగిస్తారు. అంతేకాకుండా రకరకాల రూపాల్లో తయారైన మోర్నమెంట్స్‌ను ఇంటీరియల్ డిజైన్స్‌గా వాడుతుంటారు. అందుకే నీలిరంగు మోర్నమెంట్స్‌కు ఈ గిరాకీ లభించింది. మోర్నమెంట్ ఫ్యాక్టరీ ల్లో ఏ తరహా వస్తువైతే తయారుచేయా లనుకుంటారో ఆ వస్తువును కంప్యూటర్ లో డిజైన్‌చేసి ప్రత్యేకంగా ఆ మిషన్‌కు అమర్చడంతో ఆ కళాఖండం మూర్తీ భవిస్తుంది. అందుకే నీలిరంగు గ్రానైట్ పరిశ్రమలో లభించే మోర్నమెంట్ బ్లాకులు ప్రత్యేకంగా ఎక్కువ శాతం తమిళనాడుకు పంపిస్తుంటారు.

1.70 లక్షల క్యూబిక్ మీటర్లపైగా ఉత్పత్తి..

ఏడాదిలో జిల్లాలోని నీలిరంగు గ్రానైట్ క్వారీల నుంచి సుమారు 1.70లక్షల క్యూబిక్ మీటర్లకుపైగా గ్రానైట్ బ్లాకుల ఉత్పత్తి జరుగుతుంది. ఇందులో 40శాతం విదేశాలకు ఎగుమతి అవుతుండగా.. మిగిలిన ది స్థానిక కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్లకు చేరుతుంది. అయితే నీలిరంగు గ్రానైట్‌కు విదేశాల్లో ఎక్కువగా మక్కువ చూపిస్తుంటారు. స్థానికంగా శ్లాబ్‌మెటీరియల్‌గా ఎక్కువగా వినియోగిస్తుంటారు.



విదేశాల్లో డిమాండ్..



విదేశాల్లో నీలిరంగు గ్రానైట్‌కు గిరాకీ ఉంది. ప్రత్యేకించి అక్కడ సమాదులకు నీలిరంగు సెంటిమెంట్. అందుకే నీలి రంగు గ్రానైట్ ఎక్కువగా కొనుగోలు చేస్తారు. మూ డు, నాలుగు సమాదులకు అవసరమ య్యేటట్టు ముందుగానే మోర్నమెంట్స్‌ను కొనుగోలు చేసి ఉంచుకుంటుంటారు.

-మహేష్, గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

మోర్నమెంట్ మెటీరియల్ ఆసక్తి



విదేశీయులు నీలిరంగు మోర్నమెంట్ మెటీరియల్‌పై ఎక్కువగా ఆసక్తి చూపుతారు. ఇందుకు సంబంధించి వివిధ దేశాల నుంచి బయ్యర్లు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. గ్రానైట్ క్వారీలకు నేరుగా విదేశీ బయ్యర్లు వచ్చి క్యూబిక్‌మీటరు రూ.35వేల నుంచి రూ.45 వేలు వరకు చెల్లించి కొనుగోలు చేస్తారు. అవసరమైన మెటీరియల్‌కు సంబంధి ంచి ముందే ఎగ్రిమెంట్ చేసుకుంటుంటారు.

-కోట మురళీధర్, గ్రానైట్ క్వారీ యజమాని, టెక్కలి

తండ్యాం ఎత్తిపోతల పథకం ఇకనైనా పూర్తయ్యేనా?

● గత ప్రభుత్వంలో మాటలకే పరిమితమైన నాయకులు
● సాగునీటికోసం మెట్టప్రాంత రైతుల ఎదురుచూపులు
● ఇప్పుడు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



గత టీడీపీ ప్రభుత్వంలో పనులు చేస్తున్న దృశ్యం

పొందూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జి.సిగడాం, పొందూరు మండలాల్లోని మెట్టప్రాంతానికి సాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించిన తండ్యాం ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ఆరేళ్ల కిందట శంకుస్థాపన చేశారు. ఇంతవరకు ప్రాథమిక స్థాయి కూడా దాటలేదు. దీంతో ఈ ప్రాంత రైతులు నిట్టూరుస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఈ పథకం చేపట్టిందనే ఉద్దేశంతో అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని గాలికి వదిలేసింది. రైతుల ప్రభుత్వమని బాకాలు ఊదిన వైసీపీ నాయకులు ఇక్కడి రైతాంగం పరిస్థితి కనిపించకపోవడం విశేషం. దీంతోపాటు టీడీపీ హయంలోనే శంకుస్థాపన చేసిన లైదాం ఎత్తిపోతల పథకాన్ని నామమాత్రంగా పూర్తిచేసి అరకొరగా పొలాలకు నీరు అందిస్తున్నారు. పొందూరు మండలంలోని మెట్టప్రాంతాలతో పాటు జి.సిగడాం మండలంలోని జి.సిగడాం, అబోదులపేట, దవళపేట తదితర గ్రామాల మెట్టప్రాంత పొలాలకు సాగునీరందించే లక్ష్యంతో గత తెలుగుదేశం ప్రభుత్వంలో అప్పటి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కూన రవికుమార్ రూ.8.55 కోట్లతో లైదాం ఎత్తిపోతల పథకం, రూ.26.41 కోట్లతో తండ్యాం ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేయించారు. రెల్లిగెడ్డలో ఈ రెండు ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసేందుకు నీటిపారుదల అధికారులు సిద్ధమయ్యారు. ఈ రెండు పథకాలకు 2019 ఫిబ్రవరి 13వ తేదీన ఎమ్మెల్యే రవికుమార్ శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభమయ్యాయి. అయితే 2019 సాధారణ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో అక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

నిలిపివేసిన పనులు..

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తండ్యాం ఎత్తిపోతల పథకం టీడీపీ హయంలో చేపట్టిన 10 శాతం పనులతోనే నిలిపివేశారు. పథకం పూర్తయి సాగునీరు అందుతుందని ఎదురు చూసిన పొందూరు మెట్టప్రాంత రైతులకు నిరాశే ఎదురైంది. ఐదేళ్లలో ఈ పథకం నిర్మాణం విషయంలో వైసీపీ ప్రభుత్వం ఏ మాత్రం శ్రద్ధ చూపలేదు. ఇవి పూర్తయితే తడ్యాం ఎత్తిపోతల పథకం ద్వారా 1933 ఎకరాలకు, లైదాం ఎత్తిపోతల పథకం ద్వారా 1300 ఎకరాల మెట్ట ప్రాంతానికి సాగునీరు అందుతుంది.

రవికుమార్‌పైనే ఆశలు..

తండ్యాం ఎత్తిపోతలు పథకం పూర్తిచేసి రైతులకు సాగునీరందిస్తానని మాట ఇచ్చిన రవికుమార్‌పైనే పొందూరు, జి.సిగడాం మెట్టప్రాంత రైతులు ఆశలు పెట్టుకున్నారు. కచ్చితంగా ఈ పథకాన్ని తన హయాంలోనే పూర్తిచేసి సాగునీరందిస్తానని రవికుమార్ పలు సమావేశాల్లో రైతులకు హామీ ఇస్తున్నారు.

పథకం పూర్తి చేయిస్తాం..



పొందూరు మండలంలో ఎక్కువ భూములు మెట్ట ప్రాంతంలోనే ఉన్నాయి. వర్షాధారంపైనే మేము ఆధారపడాల్సి వస్తోంది. దీంతో మా ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే రవికుమార్ కృతనిశ్చయంతో ఉన్నారు. కచ్చితంగా పూర్తిచేస్తారనే నమ్మకం ఈ ప్రాంత రైతులకు ఉంది.

-రామ్మోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు, పొందూరు

సాగునీటి రంగానికి ప్రాధాన్యం..



సాగునీటి రంగానికి ఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుంది. జి.సిగడాం చాలా గ్రామాలు వర్షాధారంపైనే ఆధారపడి ఉన్నాయి. రవి కుమార్ శంకుస్థాపన చేసిన ఈ ఎత్తిపోతల పథకం వైసీపీ ప్రభుత్వం పూర్తిచేస్తుందని ఎదురు చూశాం. ఐదేళ్లలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఎమ్మెల్యే రవికుమార్ చిత్తశుద్ధి, సమర్థత అందరికి తెలుసు కచ్చితంగా ఈ పథకం పూర్తిచేస్తారని ఆశిస్తున్నాం.

-బూరాడ వెంకటరమణ, మాజీ సర్పంచ్, వాండ్రంగి

ప్రమాదమని తెలిసినా.. 'ఆపరేషన్!

(ఐదో పేజీ తరువాయి) ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యులు ఆపరేషన్ల పేరిట అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు.

● **ఈ మాటలతో భయపెడతారు..**

ప్రైవేటు ఆస్పత్రికి గర్భిణీని తీసుకెళ్తే కొన్ని మాటలు వినిపిస్తాయి. 'రక్తం తగ్గిందని, బిడ్డ ఉమ్మనీరు తాగేసిందని, బరువు ఎక్కువగా ఉందని, రక్తపోటు అధికమైందని, బిడ్డ అడ్డం తిరిగిందని..' ఇలా రకరకాల కారణాలు చెబుతూ అమ్మ కడుపు కోసేస్తున్నారు. రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. బాధితుల్లో ఎక్కువగా పేదలు, సామాన్యులు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. గర్భిణీకి ఆపరేషన్ చేస్తే అందుకు గల కారణాలను రిపోర్టులో స్పష్టంగా రాయాలి. కానీ అనారోగ్య కారణాలు చూపుతూ ఇష్టారాజ్యంగా శరీరంపై కత్తిగాట్లు పెడుతున్నారు. ఆరోగ్యశ్రీ ఉన్నా.. అత్యవసరమని చెప్పి ఆపరేషన్లకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

● **శిశువు ఎదుగుదల లేకుండా..**

శిశువు శరీరంలో అన్ని అవయవాలు పూర్తిస్థాయిలో వృద్ధి చెందేందుకు 39 వారాల సమయం పడుతుంది. అప్పుడే శిశువు ఆరోగ్యంగా జన్మిస్తుంది. కానీ ఒక నెల ముందుగానే ప్రసవాలు చేస్తుండడంతో వారి ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతోంది. ఆపరేషన్ ద్వారా ప్రసవించిన శిశువు బరువు చాలా తక్కువగా ఉంటుంది. ఊపిరితిత్తులు సరిగ్గా ఎదగవు. దీంతో శ్వాస సంబంధమైన సమస్యలు వస్తాయి. పచ్చకామెర్లతో పాటు ఇతరత్రా ఇన్‌ఫెక్షన్లు సైతం సోకుతాయి. రోగ నిరోధక శక్తి సైతం అంతంతమాత్రమే. జీవితాంతం రకరకాల అనారోగ్య సమస్యలు వెంటాడుతాయి.

ఆఫ్‌షోర్.. ఆపేస్తారా?

(ఐదో పేజీ తరువాయి)

హయాంలో గత ఐదేళ్లలో కేవలం ఏడు శాతం మాత్రమే పనులు చేపట్టారు.

● 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం ఈపీసీల జాప్యమంటూ సాంకేతిక కొర్రీలు వేస్తూ.. అప్పట్లో రాష్ట్రంలో 183 పనులు రద్దు చేసింది. తర్వాత కొత్త ఎస్ఎస్ఆర్ రేట్లతో రివర్స్ టెండరింగ్ అంటూ 4.24ఎక్సెస్ కోట్ చేసి సింగిల్‌టెండర్‌గా మిగిలిన సాయిలక్ష్మి కనస్ట్రక్షన్స్‌కు రూ.288కోట్ల టెండర్లతో అప్పగించింది. ఈ సంస్థ కేవలం రూ.20కోట్లు వరకు మాత్రమే పనులు చేసి వదిలేసింది. 2022 తరువాత చేపట్టిన ఆర్ఎంసీ హెడ్, బాక్స్ కటింగ్, డైవర్షన్ రోడ్డు వంటి పనులు చేపట్టగా.. ఇందుకు సంబంధించిన రూ.20కోట్ల బిల్లులు చెల్లించలేదు. అలాగే 2008 నుంచి 2019 వరకు ఆఫ్‌షోర్ పనులు చేపట్టిన హిందుజా, ఎస్‌వీసీ సంయుక్తంగా చేపట్టిన పనులకు సుమారు రూ.15.50కోట్లు కాంట్రాక్టర్‌కు బకాయి ఉంది. పనుల్లో జాప్యం కారణంగా ఏటా అంచనా వ్యయం పెరుగుతోంది. ఆఫ్‌షోర్ ప్రాజెక్ట్ పూర్తిచేయాలంటే ఇంకా రూ.499కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది.

● తాజాగా గత నెల 29న ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ చావెల్.. వైసీపీ ప్రభుత్వ హయాంలో అగ్రిమెంట్ ప్రకారం 25శాతం లోపల చేపట్టిన పనులు ఎందుకు రద్దు చేయకూడదని మెమో జారీచేశారు. దీంతో ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు రద్దయినట్టేనా అన్న సందేహం కలుగుతోంది. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టి సారిస్తే ఆఫ్‌షోర్ ప్రాజెక్ట్‌కు మోక్షం లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

● ఈ విషయమై నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ స్వర్ణకుమార్ వద్ద ప్రస్తావించగా ఆఫ్‌షోర్‌కు సంబంధించి మొత్తంగా 45శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. సాయిలక్ష్మి కనస్ట్రక్షన్స్ రూ.20కోట్లు మేరకే పనులు చేసిందన్నారు. అందుకే సీఈ స్థాయి అధికారి ఈ పనులు రద్దు చేయకుండా పునరుద్ధరించాలని ప్రభుత్వానికి కోరుతున్నట్లు తెలిపారు.

జాబ్‌కార్డులపై ప్రత్యేక దృష్టి

(ఐదో పేజీ తరువాయి)

ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అనుమతులు రాగానే ట్రాన్స్‌పాండర్లు శతశాతం రాయితీపై అందజేస్తామని తెలిపారు. వీటికోసం 48 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ఫిషర్‌మెన్ అభివృద్ధి గ్రామాల కింద జిల్లాలో మూడు గ్రామాల్లో రూ.2కోట్ల చొప్పున ప్రతిపాదనలను తయారు చేస్తామని తెలిపారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజు, ఎల్‌డీఎం సూర్యకిరణ్, మత్స్యశాఖ ఏడీ సత్యనారాయణ, డ్వామా పీడీ సుధాకర్ పాల్గొన్నారు.

6 వరకు ఉపాధ్యాయ ఓటర్ల నమోదు

(ఐదో పేజీ తరువాయి)

నమోదు చేసుకోవాలి. నవంబరు 23న ఇందుకు సంబంధించి డ్రాఫ్ట్ పబ్లిష్ అవుతుంది. డిసెంబరు 9 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తాం. 30న తుది జాబితా విడుదల చేస్తాం. దీనిపై అధికారులు దృష్టి సారించాలి. నమోదుకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు సెకండరీ స్థాయి నుంచి పాఠశాలలు, కళాశాలలు, యూనివర్శిటీల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా అర్హులే. పార్ట్‌టైమ్ విధానంలో పని చేసేవారు అనర్హులు. గత ఆరేళ్లలో సెకండరీ స్థాయికి మించిన ఏ విద్యాసంస్థలో అయినా మూడేళ్లకు తగ్గకుండా పనిచేసిన ఉపాధ్యాయులు అర్హులు. పాత ఓటు చెల్లుబాటు కాదు. గతంలో ఓటు ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవాలి' అని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో తిరుమల చైతన్య, ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి తవిటినాయుడు, సి-సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

అలరించిన నాటిక పోటీలు



నాటికలోని ఓ దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సూత్రా ఫౌండేషన్ శ్రీ సుమిత్రా కళా సమితి సంయుక్త ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నాటిక పోటీలు శనివారం రెండో రోజు ప్రదర్శిన నాటికలు ప్రేక్షకులను అలరించాయి. పార్వతీపురం మన్యం జిల్లా పెదమేరంగికి చెందిన రౌతు అప్పలనాయుడు కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన కొండగాలి నాటిక, కత్తివరం చెందిన నీలకంఠేశ్వర నాటిక సమాజం వారి మార్పు శ్రీకాకుళానికి చెందిన బీఎంఎస్ పట్నాయక్ దర్శకత్వంలో నిర్జీవ నినాదం నాటిక ఆకట్టుకున్నాయి.

గుల్లబారుతున్న ఎముకలు



● వృద్ధులు, మహిళల్లో పెరుగుతున్న సమస్య
● అవగాహనతోనే నివారణ
● నేడు వరల్డ్ ఆస్టియోపోరోసిస్ డే

అరసవల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): డబ్ల్యూహెచ్‌వో సర్వే ప్రకారం 50 ఏళ్ల పైబడినవారిలో ఆస్టియోపోరోసిస్ లక్షణాలు కనిపిస్తున్నట్టు తేలింది. దేశంలో ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు, ప్రతి ఎనిమిది మంది మగవారిలో ఒకరు ఈ వ్యాధితో బాధపడుతున్నట్టు సర్వే ద్వారా తెలిసింది. జీవనశైలిలో మార్పులు, మంచి పోషకాహారం తీసుకోవడం, సరైన వ్యాయామం చేయడం ద్వారా ఈ వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చు.

ఆస్టియోపోరోసిస్ లక్షణాలు

శరీరంలో గల ఎముకల సాంద్రత తగ్గి అవి గుల్లబారి, బలహీనపడి, పగుళ్లు ఏర్పడతాయి. చిన్నపాటి ప్రమాదానికే అవి సులువుగా విరిగిపోతాయి. ఈ వ్యాధి బారినవారు నడుస్తూ తూలి పడిపోయినా ఎముకలు విరిగిపోయే ప్రమాదం ఉంటుంది. బరువు తగ్గడం, నడుము వంగిపోవడం, నడుంనొప్పి అధికంగా ఉండడం, ముంజేతి వద్ద ఎముకలో పగుళ్లు రావడం ఈ వ్యాధి బారిన పడినవారికిలో కనిపిస్తాయి. తీవ్ర సమస్య ఉన్నవారు ఎత్తు తగ్గడం, దుస్తులు ధరించడంలో ఇబ్బందులురావడంతో పాటగు నిలబడడం, నడిచే సామర్థ్యాన్ని కోల్పోతారు. తుంటి ఎముకలు, వెన్నుపూస, మణికట్టులో పగుళ్లు ఏర్పడతాయి.



ఎందుకు వస్తుంది?

సాధారణంగా ఎముక ఎదుగుదల్లో భాగంగా పాత కణాలు పోయి, కొత్త క ణాలు చేరుతాయి. దీనినే ఎముక రీమాడ లింగ్ అంటారు. ఈ ప్రక్రియ చిన్నతనంలో మొదలై, కౌమారదశ వరకూ అతి వేగంగా ఉంటుంది. సుమారు 30 ఏళ్లకు పూర్తిస్థాయికి చేరుతుంది. ఈ దశలో కొత్తకణాలు ఎక్కువగా ఉండడంతో ఎముక దృఢంగా ఉంటుంది. ఆ తరువాత క్రమేణా కొత్త కణాలు చేరడం తగ్గుతుంది. 50 ఏళ్లు వచ్చేసరికి ఎముక సాంద్రత తగ్గి గుల్లబారుతుంది.

గుర్తించడం ఎలా?

ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిక ప్రకారం ఎ ముకల సాంద్రత (బీఎమ్‌డీ) 2.5 అంతకంటే తక్కువగా ఉండడం, టి-స్కోరు-1 కంటే తక్కువగా ఉంటే అది బోలు ఎముకల వ్యాధిగా నిర్ధారణ చేయవచ్చు. దీనికి ముఖ్యంగా డెక్సా స్కాన్ పరీక్ష ద్వారా ఎముకల సాంద్రత (బీఎమ్‌డీ)ని కొలవడం, ఫ్యాక్చర్ ప్రమాదాన్ని అంచనా వేయవచ్చు. క్రమం తప్పకుండా 45 ఏళ్లు పైబడిన వారు ఈ పరీక్షలు చేయించు కోవడం ద్వారా తొలిదశలోనే ఈ వ్యాధిని గుర్తించి నూరుశాతం ఉపశమనం పొందవచ్చు.

నిర్ధారణ.. చికిత్స

ఎక్స్‌రే, సీటీస్కాన్‌లతో ఎముక ఫ్రాక్చర్‌ని వైద్యులు గుర్తిస్తారు. అలాగే బీఎండీ (బోన్ మినరల్ డెన్సిటీ) పరీక్ష, డెక్సా స్కాన్‌తో ఎముక సాంద్రతను పరీక్షిస్తారు. పరీక్ష ఫలితాలు తరువాత అనంతరం వైద్యులు తగిన చికిత్సను అందిస్తారు. అవసరమైన మందులు ఇస్తారు.

వ్యాధికి కారణాలు

● అధిక బరువు కలిగి ఉండడం.
● హార్మోన్ థెరపీ తీసుకోవడం.
● అధికంగా స్టెరాయిడ్స్ వాడడం.
● పొగ తాగడం.
● అధికంగా ఆల్కాహాల్ తీసుకోవడం.
● కుటుంబపరంగా ఈ వ్యాధి కలిగి ఉండడం.
● తక్కువ శారీరక శ్రమ కలిగి ఉండడం.
● స్త్రీలలో ఈస్ట్రోజెన్ హార్మోన్ స్థాయిలు తక్కువగా ఉండడం.
● విటమిన్-డి స్థాయిలు తక్కువగా ఉండడం.
● అనారోగ్యకర ఆహారపు అలవాటు ఉండడం.

నివారణే ముఖ్యమైన మార్గం



ఆస్టియోపోరోసిస్ అనే వ్యాధి అవగాహన లోపం వల్లే సంభవిస్తుంది. ఈ వ్యాధి వల్ల సులువుగా ఎముకలు విరిగిపోతాయి. శస్త్రచికిత్స చేసిన తర్వాత నయమైనా సరే క్వాలిటీ ఆఫ్ లైఫ్ తగ్గిపోతుంది. తొలిదశలోనే ఈ వ్యాధిని గుర్తించడం ముఖ్యం. 45 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారి బీఎమ్‌డీ, సీరం కాల్షియం, విటమిన్-డి3 లెవెల్స్, ఎక్స్‌రే పరీక్షలు చేయించుకోవాలి. వృద్ధులు చేతికర్రను వాడడం, మేడ మెట్లు ఎక్కేటప్పుడు రెయిలింగ్స్ సహాయం తీసుకోవడం వంటివి చేయాలి. క్రమం తప్పకుండా వైద్యుని సంప్రదించి, మందులు వాడాలి. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఈ వ్యాధిని నిర్ధారించేందుకు ఎక్స్‌రే, సీరం కాల్షియం, స్కెలిటల్ సర్వే తదితర పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

- లుకలాపు ప్రసన్నకుమార్, రిమ్స్ ఎముకల వైద్య నిపుణులు

నివారణ మార్గాలు

● క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయాలి.
● ఉదయం ఏడు నుంచి ఎనిమిది గంటల మధ్య, సాయంత్రం నాలుగు, ఐదు గంటల మధ్య ఎండలో ఉండడం ద్వారా శరీరం తనకు కావలసిన విటమిన్-డి తయారు చేసుకుంటుంది.
● ధూమపానం, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలి.
● అధికంగా స్టెరాయిడ్లు వాడుక నివా రించాలి.
● కాల్షియం అధికంగా గల ఆహార పదార్థాలు(చిన్నముల్లు గల చేపలు, పాల ఉత్పత్తులు, డ్రై ఫ్రూట్స్, ఎగ్ వైట్, ఆకు కూరలు) తీసుకోవాలి.
● కాఫీ తాగడం తగ్గించాలి.
● అధికంగా శీతల పానీయాలు వినియోగించరాదు.
● వ్యాధిని తొలిదశలో గుర్తిస్తే క్రమం తప్పకుండా కాల్షియం మాత్రలు వేసుకోవాలి.

ఎవరికి ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది?

● 45 ఏళ్లు పైబడిన స్త్రీలు, 60 ఏళ్లు పైబడిన మగవారిలో ఎక్కువగా ఈ వ్యాధి కనిపిస్తుంది.
● రుతుక్రమం ఆగిపోయిన స్త్రీలలో యూరిన్ ద్వారా కాల్షియం ఎక్కువగా పోతుంది.
● కాఫీ తాగే వారిలో కూడా కాల్షియం నష్టం ఎక్కువగా ఉంటుంది.
● అనారోగ్యకర ఆహార అలవాట్లు, ఊబకాయం, పూర్తిగా శారీరక శ్రమ లేకుండా ఉన్న వారిలో ఈ వ్యాధి కనిపిస్తుంది. ఇది చిన్న వయసు వారిని కూడా వృద్ధులుగా మార్చేదిగా ఉంటుంది.

అన్నదాన పథకానికి లక్ష విరాళం

అరసవల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి శాశ్వత అన్నదాన పథకానికి శ్రీకాకుళానికి చెందిన బుర్రా రాంబాయి, ఎస్.శ్రీనివాసరావు దంపతులు రూ.1,00,116లను ఈవో ఎర్రంశెట్టి భద్రాజీకి అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు,ఎ.శోభనాద్రాచార్యులు పాల్గొన్నారు.

కొవ్వాడ నిర్వాసిత కాలనీ నిర్మాణానికి చర్యలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం నిర్వాసితుల కాలనీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో అణువిద్యుత్ కేంద్రం నిర్వాసితులు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసితుల భూములకు సంబంధించి 21 మందికి పేమెంట్ చేయాలని ఎమ్మెల్యే పేర్కొనగా, ప్రతిపాదనలు పంపించామని తహసీల్దార్ తెలిపారు. మిగిలిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని అణువిద్యుత్ కేంద్రం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు కలెక్టర్ ఆదేశించారు.కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ప్రసాదరావు, ఎచ్చెర్ల తహసీల్దారు సింహాచలం, వేణుగోపాలరావు, మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల మండలానికి సాగునీరందించాలి

ఎచ్చెర్ల మండలంలోని ఆయకట్టుకు సాగునీరందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎచ్చెర్ల మండలానికి సంబంధించి సాగునీరు, నియోజకవర్గంలో ఉపాధి హామీ పనులు, ఆర్అండ్‌బీ రహదారులపై ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి సమావేశం నిర్వహించారు.సమావేశంలో ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, ఆర్అండ్‌బీ ఎస్ఈ సుధాకర్, ఇరిగేషన్ ఈఈ సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్వప్నిల్ దినకర్‌పుండ్కర్

బిల్లుల బకాయిలు చెల్లిస్తాం: కూన

సరుబుజ్జిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2014-19లో టీడీపీ ప్రభుత్వ పాలనలో నిర్మాణాలు పూర్తి చేసి బిల్లులు కాని ప్రతి ఒక్కరి బకాయిలను త్వరలో చెల్లిస్తామని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. శనివారం మండలంలోని పురుషోత్తపురం, రావివలస, నందికొండ, గొనెపాడు, మతలబుపేట, తెలికిపెంటల్లో మరణించిన టీడీపీ నాయకుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రవికుమార్ విలేకరులతో మాట్లాడుతూ వైసీపీపాలనలో సైకో సీఎం జగన్ రెడ్డి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న సుమారు 1300 కోట్లు బకాయిలు చెల్లించాలని సీఎం చంద్రబాబును కోరినట్లు తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ, తెలుగు యువత అధ్యక్షుడు తాడేల రాజారావు, ఐటీడీపీ అధ్యక్షుడు నూక ప్రభాకర్, నాయకులు కిల్లి సిద్దార్థ, నందివాడ గోవిందరావు, నూక కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

సీఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు: శంకర్

అరసవల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని సమస్యలను సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రుల దృష్టికి తీసుకువెళ్లినట్లు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. విజయవాడలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ ప్రతినిధుల తో సమావేశమయ్యారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ సీఎం చంద్రబాబునాయుడిని కలుసుకుని సమస్యలపై నివేదిక ను అందజేశారు. నివేదికలను సిద్ధంచేయాలని, అభివృద్ధి పనులకు సంబంధిం చి త్వరలో నిధులు మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చారని ఎమ్మెల్యే చెప్పారు.



చంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

జెమ్స్‌లో నేషనల్ ఫిజియోథెరపీ కాన్ఫరెన్స్

గుజరాతీపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) :రాగోలులోని జెమ్స్ హాస్పిటల్‌లో ఫిజియోథెరపీ కాలేజీ, జెమ్స్ కేన్సర్ వింగ్ సంయుక్తంగా నేషనల్ ఫిజియోథెరపీ కాన్ఫరెన్స్ నిర్వహించాయి.ఈ సందర్భంగా ముంబాయి, చెన్నై, హైదరాబాద్, విజయవాడ నుంచి వచ్చిన ఫిజియోథెరపీ ప్రతినిధులు మూడురోజులుగా ఫిజియోథెరపీలో ఆధునాతన చికిత్స కాన్సర్ రిహాబిలిటేషన్‌లో మెరుగైన విధానాలపై విద్యార్థులు అవగాహన కల్పించారు. జెమ్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం.వెంకటరమణ, వైద్యులు రవేంద్రనందన, ముంబాయి టాటా మెమోరియల్ కేన్సర్ హాస్పిటల్ విభాగాధిపతి డాక్టర్ అనూరాధ, డాక్టర్ అజిత కాన్సర్ రిహాబిలిటేషన్‌లో వక్తలుగా వ్యవహరించారు. డాక్టర్ బి.రాజేష్, సుబ్బరా యులు, శ్రద్ధకదమ్,ఇంద్రాణిలు ఫిడియోట్రిక్ ఫిజియోథెరపీ, రోబోటిక్ తదితర అంశాలపై విశదీకరించారు. వివిధ కళాశాలల విద్యార్థులు స్పోర్ట్స్, అకడమిక్ సంబంధించి పలు కార్యక్రమాలు నిర్వహించి విజేతలు బహుమతులు అందజేశారు. ఆసుపత్రిలో మెరుగైన వైద్యమందిస్తున్న డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, ఈసీవో ఆద్విక్, సీఏవో స్వర్ణరామ్మోహన్‌లను ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాహుల్ షేక్, అధ్యాపకులు డాక్టర్ లక్ష్మిలలిత, అశోక్ రెడ్డి, సుధీర్, శ్రీనివాస్, హేమంత్, అంబేద్కర్, రామారావు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న వివిధ కళాశాలల విద్యార్థులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: ఎంపీ కలిశెట్టి

జి.సిగడాం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. డీఆర్‌వలసలో పల్లెపండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సీసీరోడ్లు, డ్రైనేజీలకు భూమి పూజ చేశారు. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజాన్ని తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, టీడీపీ మండలాధ్యక్షుడు కుమరాపు రవికుమార్, నాయకులు టంకాల మౌళీశ్వరరావు, కుమరాపు అప్పన్న చందు, ఎంపీటీసీ సభ్యుడు రమేష్‌నాయుడు, శ్రీను పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే కూటమి ధ్యేయం

లావేరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధే కూటమి ప్రభుత్వం ధ్యేయమని తెలుగుయువత మండలాధ్యక్షుడు, అప్పాపురం మాజీ సర్పంచ్ గంట్యాడ మహేష్ తెలిపారు. శనివారం మండలంలోని అప్పాపురంలో పల్లెపండగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీరోడ్లు, కాలువల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్-6 హామీలను కూటమి ప్రభుత్వం దశల వారీగా అమలు చేస్తోందని తెలిపారు. పెదలింగాలవలస, పోతాయవలసల్లో కూడా పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి లంక నారాయణరావు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



అప్పాపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నాయకులు

మత్స్యకారులను అప్రమత్తం చేయాలి: తహసీల్దార్

ఇచ్ఛాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):వర్షాలు ఈనెల 24 నుంచి కురిసే అవకాశం ఉండడంతో మత్స్యకారులను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ ఎన్.వెంకటరమణ అధికారులకు సూచించారు. శనివారం డొంకూరు తీర ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం తుఫాన్ రక్షిత భవనంలో రెవెన్యూసచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చాటింపు వేయాలని, రక్షిత భవనంలో మౌలిక సదుపాయాల ఏర్పాటు చేయాలని కోరారు.

సచివాలయంలో రికార్డుల పరిశీలన

కంచిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకర్ణపురం సచివాలయం తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ శనివారం రికార్డులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలందించాలని కోరారు.

'పల్లెపండగ'తో ఒరిగిందేమీ లేదు

ఆమదాలవలస అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లెపండగతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని వైసీపీ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్ విమర్శించారు. శనివారం ఆమదాలవలసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త మద్యం పాలసీ వల్ల 15 వేల మంది సిబ్బంది రోడ్డున పడ్డారని తెలిపారు. మంత్రి పదవి రాలేదని ఆమదాలవలస ఎమ్మెల్యే మతిస్థిమితం కోల్పోయి తమ్మినేని సీతారాంపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. బలసలరేవు వంతెన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కార్య క్రమంలో ఉమామహేశ్వరరావు, చిన్నారావు పాల్గొన్నారు.

కిచెన్‌గార్డెన్ల ఏర్పాటుకు చర్యలు: డీవైఈవో

పొందూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వోన్నత పాఠశాలల్లో కిచెన్‌గార్డెన్ల ఏర్పాటుకు చర్యలు తీసు కుంటున్నట్లు డీవైఈవో విజయకుమారి తెలిపారు. తాడివలస జడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఏర్పాటుచేసిన కిచెన్‌గార్డెన్‌ను పరిశీలించారు. కార్య క్రమంలో హెచ్ఎం బల్ల కంఠయ్య పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు అవగాహన

శ్రీకాకుళంక్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో శనివారం ద్విచక్రవాహనాలు నడుపుతున్న మైనర్లు, వారి తల్లిదండ్రులకు సీఐ నాగరాజు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పిల్లల బాధ్య త తల్లిదండ్రులపై ఉందని, వారికి 19 ఏళ్ల రాకముందే వాహనాలు ఇవ్వడం వల్ల అతివేగంగా వెళ్లి రోడ్డుప్రమాదాలకు గురయ్యే అవకాశముందని వివరించారు. అనంతరం మార్కెట్‌లో సమస్యలపై తోపుడు బండ్ల వర్తకులతో మాట్లాడారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సాయం

అరసవల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలోని సీతంపేటకు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థి రొంగలి శివాజీకి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి రూ.1,50,000లు శ్రీకాకుళంలో శనివారం అందజేశారు. శ్రీకాకుళం జిల్లా ఏకలవ్య బృందం రూ.44వేలు, జస్ట్ డూయిట్ బృందం రూ.1.16 లక్షలు సమకూర్చారు. కార్యక్రమంలో గొర్లె మురళి, మోహనరావు, గోవిందరావు, రెడ్డి గిరిజా శంకర్, ఎండు చిన్నారావు పాల్గొన్నారు.

- కవిటి, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): కవిటికి చెందిన విద్యార్థి ఎన్.అవినాష్‌కు హైదరాబాదులోని చింతామణి ట్రస్టు అండగా నిలిచింది. ఈ మేరకు శనివారం ఇంజనీరింగ్ చదువు నిమిత్తం ట్రస్టుప్రతినిధులు రూ.50 వేలును విద్యార్థి తల్లి సత్యవతికి కవిటిలో అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

విద్యార్థులపై శ్రద్ధ కనబరచండి

ఇచ్ఛాపురం, అక్టోబరు 19 :(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎంఈవో కె.అప్పారావు కోరారు. శనివారం తిప్పనపుట్టుగ ఎంపీపీఎస్ పాఠశాలలో వార్షికతనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు.

క్రైం కార్నర్

వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడు చోరీ

మెళియాపుట్టి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడు చోరీ ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంతలక్ష్మీపురం పంచాయతీ టకోయి గ్రామానికి చెందిన పల్లె కనకమ్మ శుక్రవారం సాయంత్రం ఇంటిలో వంట చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి విద్యుత్ నిలుపుదల చేసి ఆమె మెడలోని మూడు తులాల బంగారం పుస్తెతాడును అపహరించాడు. బాధితురాలు మెళియాపుట్టి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ రామారావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

టెక్కలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చాకిపల్లి గ్రామానికి చెందిన ముద్ద చిన్నమ్మ శనివారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యసేవలకు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు వివరాలు ఆరా తీశారు.

అత్యాచారయత్నంపై కేసు నమోదు

నందిగాం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహితపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శనివారం తెల్లవారుజామున భర్త కూరగాయలు తీసుకువచ్చేందుకు కోటబొమ్మాళి మండలం శ్రీపురానికి వెళ్లగా.. టి.భువనేశ్వర్ అనే వ్యక్తి ఇంట్లో ప్రవేశించి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఆమె ప్రతిఘటించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడంతో నిందితుడు పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

రణస్థలం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పైడిభీమవరంలోని ఓ రసాయన పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుడు పి.చిన్నంనాయుడు (33) శనివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. బొండపల్లి మండలం బీరాజేరు గ్రామానికి చెందిన చిన్నంనాయుడు కొంతకాలంగా పైడిభీమవరంలోని ఓ రసాయన పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం చిన్నంనాయుడు పరిశ్రమలో అస్వస్థతకు గురయ్యాడు. దీంతో చికిత్స కోసం విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిన్నంనాయుడు కుటుంబ సభ్యులు మృతదేహాన్ని పరిశ్రమ గేటు వద్దకు తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అయితే ఈ విషయం తెలుసుకున్న జేఆర్ పురం పోలీసులు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కందివలసగెడ్డ నుంచి చిన్నంనాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

సంతకు తరలిస్తున్న 23 గేదెలు స్వాధీనం

కంచిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా తరలిస్తున్న 23 గేదెలను కంచిలి పోలీసులు శనివారం ఉదయం పట్టుకుని, మూడు వాహనాలను సీజ్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. కవిటి మండలం జమేదారుపుట్టుగ సమీపం నుంచి మూడు ఆటోల్లో 23 గేదెలను విజయనగరం జిల్లా నారాయణవలస సంతకు తరలిస్తున్నారు. ఈక్రమంలో కంచిలి జాతీయ రహదారి వద్ద వాహనాల తనిఖీల సమయంలో పోలీసులు పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న గేదెలను గోశాలకు తరలించారు. ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

వసతి గృహాల్లో వసతులపై ఆరా

టెక్కలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన కళాశాల బాలుర, పోలవరం బీసీ బాలుర, భీంపురం బాలికల వసతిగృహాలను శనివారం సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు సందర్శించారు. వసతి గృహాల్లో పరిశుభ్రతపై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. విద్యార్థుల వస తులు, వారి ఆహార పద్ధతులు, విద్య, వైద్యం, మెనూలను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌డబ్ల్యూవోలను ఆదేశించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కోటబొమ్మాళి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పరిరక్షించాలని స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత తెలిపారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం కోర్టు ఆవరణను శుభ్రం చేసి మొక్కలు నాటారు. కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

పాతపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలలో మెనూను సక్రమంగా అమలు చేయాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి మన్యం రోహిణి అన్నారు. లాబర గిరిజన బాలుర, బొమ్మిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల్లో శనివారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు.

బీసీ బాలికల వసతి గృహం తనిఖీ

మందస, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మందస ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని సోంపేట అడిషనల్ జ్యుడీషియల్ న్యాయాధికారి కె.కిషోర్‌బాబు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేప ట్టారు. బాలికలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. మెనూతో పాటు పరిసరాలను పరి శీలించి హెచ్‌డబ్ల్యూవో కృష్ణవేణికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట మందస ఎస్ఐ ఖాదర్ బాషా ఉన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

హిరమండలం/ఎల్.ఎన్.పేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమదాలవలస జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.మణి ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆమె ఎల్ఎన్‌పేట, హిరమండలంలోని కేజీబీవీలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలల స్థితిగతులు, బాలికలకు అందిస్తున్న వివిధ సేవలపై ఆరా తీశారు. తరగతి, వంట గదులను పరిశీలించారు.ఆమెతో పాటు ఎంఈవో చంద్రమౌళి, పాఠశాలల ప్రత్యేకాధికారులు ఎం. వెంకట అంబిక, కృష్ణవేణి తదితరులున్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందివ్వాలి

సోంపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు రుచికరమైన భోజనం అందివ్వాలని సోంపేట ఆరో అడిషనల్ జిల్లా న్యాయాధికారి కె.కిషోర్‌బాబు కోరారు. శనివారం మండలంలోని రాజాం కేజీబీవీ పాఠశాలలో రికార్డులు, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పొందూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పొందూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి బి. జ్యోత్స్న తెలిపారు. శనివారం వావిలపల్లి పేట మోడల్‌స్కూల్‌లో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రభాకర్, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. కాగా రాపాక కూడలిలోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలను, బాలుర వసతిగృహాన్ని కూడా ఆమె పరిశీలించారు.

అసంతృప్తి: మీ ఇంటిని ఇలాగే ఉంచుతారా?

● హెచ్‌డబ్ల్యూవోపై న్యాయాధికారి అసంతృప్తి


బాలికల వసతిగృహాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారి హరిప్రియ

నరసన్నపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కళాశాలల బాలికల ఇంటిగ్రేటెడ్ వసతి గృహాన్ని శనివారం స్థానిక సివిల్ కోర్టు న్యాయాధికారి సీహెచ్ హరిప్రియ సందర్శించారు. ఇరుకు గదుల్లో విద్యార్థినులుండడం, బాత్ రూంలు, మరుగుదొడ్ల నిర్వహణ దారుణంగా ఉండడంతో ఆమె అసంతృప్తి వ్యక్తంచేశారు. మీ ఇల్లు అయితే ఇలాగే ఉంచుతారా అంటూ హెచ్‌డబ్ల్యూవో పి.శ్రీలక్ష్మిని ప్రశ్నించారు. అద్దె భవనం కావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని హెచ్‌డబ్ల్యూవో తెలిపారు. భోజనం రుచిగా ఉండడం లేదని, తెల్లవారుజామున చేసిన వంటకాలను పెడుతున్నారని విద్యార్థినులు న్యాయాధికారి దృష్టికి తీసుకువచ్చారు. తక్షణం తగుచర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో బార్ అసియేషన్ సభ్యుడు జీవీజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం న్యాయాధికారి స్థానిక సబ్ జైలును పరిశీలించారు.

కళాశాల ఫీజు చెల్లిస్తేనే పరీక్షకు అనుమతిస్తారా? ఆవేదన



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

టెక్కలి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కళాశాల ఫీజు చెల్లిస్తేనే ఎగ్జామినేషన్ ఫీజు కట్టించుకుంటామని డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ చెప్పడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. స్పెషల్ ఫీజులు కూడా కట్టాలని ఒత్తిడి చేస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యలపై ఆర్డీవో కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ప్రిన్సిపాల్‌తో చర్చించి న్యాయం చేస్తానని ఆర్డీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దుర్గాప్రసాద్, తరుణ్, మహేష్, రవి, గిరిధర్ పాల్గొన్నారు.

వంద రోజుల్లోగా ఇళ్లు పూర్తి చేయాలి

పలాస, అక్టోబరు 19: వంద రోజుల్లో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లన్నీ పూర్తి చేయాలని మునిసిపల్ ప్రత్యేకాధికారి, జిల్లా భూగర్భ జలవనరులశాఖ డీడీ బి.రమణమూర్తి, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి కోరారు. శనివారం మునిసిపల్ కార్యాలయంలో 'మన ఇల్లు-మన గౌరవం'లో ఇళ్ల నిర్మాణంపై అధికారులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రామకృష్ణాపురం, బొడ్డపాడు, తర్లాకోట గ్రామాల వద్ద నిర్మిస్తున్న గృహాలను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ తరువాత నిర్మించే ఇళ్లకు ఎటువంటి ప్రభుత్వం ఎటువంటి రుణాలివ్వదని, లబ్ధిదారులే కట్టుకోవాల్సి ఉంటుందన్నారు. దీనిపై వార్డుల వారీగా లబ్ధిదారుల వివరాలు సేకరించి వారికి పూర్తి అవగాహన కలిగించాలన్నారు. 1955 గృహాలు నిర్మించాల్సి ఉండ గా 310 చివరి దశలో ఉన్నాయని, మరో 207 లింటల్ లెవెల్‌లో ఉన్నాయని, వీటిని పూర్తి చే యించాల న్నారు. 'మన ఇల్లు-మన గౌరవం' లక్ష్యాలను సాధించే దిశలో అధికారులు, సిబ్బంది విధులను నిర్వహించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు కావాల్సిన ఉచిత ఇసుక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలన్నారు. అంతకు ముందు ప్రభుత్వ లే అవుట్లను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి, చిత్రంలో ప్రత్యేకాధికారి రమణమూర్తి

త్వరితగతిన నిర్మించాలి

పలాసరూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కలిగించాలని ఆర్డీవో కృష్ణమూర్తి ఆదేశించారు. పలాస మండలంలోని తర్లాకోట, బొడ్డపాడు గ్రామాలతో పాటు కోసంగిపురం కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను శనివారం ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు హౌసింగ్ ఏఈ వైకుంఠరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఎండల మల్లన్న సేవలో ఆర్డీవో

టెక్కలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రావివలస ఎండలమల్లికార్జున స్వామిని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి శనివారం దర్శించు కున్నారు. కార్తీకమాసంలో భక్తులకు ఇబ్బం దులు కలగకుండా దర్శన ఏర్పాట్లు, క్యూలైన్‌లు, మౌలిక సౌకర్యాలు, వైద్య సేవలు, పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవో వాకచర్ల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ వాత్సల్య' దరఖాస్తుల స్వీకరణ

ఆమదాలవలస, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసీడీఎస్ పీవో ఎస్.అనూరాధ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుపేద, నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలకు విద్య వైద్యం కోసం నెలకు రూ.4 వేలు అందించేందుకు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి 18 సంవత్సరాల్లోగా తల్లి, తండ్రి కోల్పోయిన పిల్లలు, ఇతర కుటుంబాల్లో నివసిస్తున్న అనాథ పిల్లలు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నామన్నారు.

తిలారు రైల్వే స్టేషన్ సమస్యలు పరిష్కరించండి

కోటబొమ్మాళి: తిలారు రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును శనివారం కలిసి వినతిపత్రం అందించారు. బరంపురం-విశాఖ ఎక్స్‌ప్రెస్, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లను తిలారులో నిలుపుదల చేయాలని, పేటపాడు నుంచి గవరమ్మపేట వరకు రైలు ట్రాక్ పక్కన సీసీ రోడ్డు నిర్మించాలని, తిలారు పెద్ద చెరువును అభివృద్ధి చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశించినట్లు రామకృష్ణ తెలిపారు.

తోక వలలో పడి కొండచిలువ మృతి

జలుమూరు, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి): నామానపేట వద్ద కాలువలో తోక వలలో పడి కొండ చిలువ శుక్రవారం రాత్రి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. 19ఆర్ కాలువలో నామానపేట వద్ద కొందరు రొయ్యల కోసం తోకవల ఏర్పాటు చేశారు. కొండచిలువ నీటి ప్రవాహంలో వచ్చి ఆ వలలో చిక్కింది. శనివారం తెల్లవారు జామున గ్రామస్థులు చూసి దానిని బయటకు తీయగా అప్పటికే మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు.

సివిల్స్ ఫలితాల్లో గౌడోకు ఏడో ర్యాంక్



పర్లాకిమిడి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పర్లాకిమిడికి చెందిన శ్రీమాన్ దెబో బ్రతో గౌడో ఒడిశా సివిల్ సర్వీస్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంక్ సాధించాడు. ఆయనను పలువురు అభినందించారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు

పాతపట్నం: పాతపట్నంలో నిర్వహిస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యా ర్థిని ఆత్మహత్య విషయంలో సకాలంలో స్పందించకపోవడం, అలసత్వం వహించడంపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వార్డెన్ నాగేశ్వరిలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పాఠశాలలో ఉంటూ చదువుకుంటున్న సీతంపేట మండలం వంబరెల్లి గ్రామానికి చెందిన సవర లావణ్య (12) ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. అలాగే ఈ ఘటనపై శ్రీకాకుళం కలెక్టర్ ఆదేశాల మేరకు టెక్కలి ఆర్డీవోను విచారణాధికారిగా నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

పాఠశాలల ఆవరణలు పరిశుభ్రం చేయండి

హిరమండలం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశా లల ఆవరణలో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు పేరుకుపోయాయని, తక్షణం ఉపాధి నిధులతో వాటిని తొలగించి పరిశుభ్రం చేయాలని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన మండల సాధారణ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతురావు, ఎంపీడీవో కాశీప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

కొత్తూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాతల కాలనీకి చెందిన కోల జగదీష్ ఈనెల 17 నుంచి కనిపించలేదని తల్లి కోల కల్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అహ్మద్ తెలిపారు. జగదీష్ స్థానికంగా ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 17న కళాశాలకు వెళుతున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఆచూకీ లభించక పోవడంతో శనివారం కల్యాణి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మాజీ సైనికుల కుటుంబాలకు గుర్తింపు కార్డులు

నరసన్నపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న మాజీ సైనికుల కుటుంబాలకు గుర్తింపు కార్డులను అందజేయడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి ఎ. శైలజ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘ చైర్మన్ దేవలింగం సాంబశివరావు, అధ్యక్షుడు డొంకాన రమేష్ పాల్గొన్నారు.

యూజీసీ నెట్‌లో రమ్యశ్రీ ప్రతిభ

అరసవల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అరసవల్లికి చెందిన విద్యార్థి ఉంగటి రమ్యశ్రీ యూజీసీ నెట్ ఆలిండియా పరీక్షల్లో ప్రతిభ చూపింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా 11 లక్షల మంది హాజరు కాగా ఆమె 130వ ర్యాంకు సాధించింది. శ్రీకాకుళం నగర టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఉంగటి రమణమూర్తి సోదరుడు ఉంగటి పాపారావు కుమార్తె రమ్యశ్రీ సత్తాచాటడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. రమ్యశ్రీ భర్త భైరి శ్రీనివాస్ ఏపీజీవీబీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. బంధువులు, స్నేహితులు అభినందించారు.

ఎరువులను తయారు చేయాలి

జలుమూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద కేంద్రాలన వినియోగంలోకి తీసుకురావాలని శ్రీకాకుళం డీఎల్పీవో ఎల్‌వీ రమణ అన్నారు. రావిపాడు గ్రామంలో నిర్మించిన చెత్త సంపద కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఇళ్ల నుంచి చెత్తను సేకరించి ఈ కేంద్రాలకు తరలించి ఎరువులను తయారు చేయాలన్నారు. ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, కార్యదర్శి చిన్నారావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించండి

● పీఆర్ కమిషనర్‌ను కోరిన శిరీష

పలాస, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గంలో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు శనివారం విజయ వాడలో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణకాంత్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మునిసిపాలిటీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, కిడ్నీ ప్రభా విత ప్రాంతాల్లో సురక్షితనీరు అందించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అలాగే వజ్రపుకొత్తూరు మండలం పూడిలంక గ్రామానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. ఉద్దానం ప్రాంతంలో ఎక్కువ సంఖ్యలో కిడ్నీ బాధితులున్నారని, స్వచ్ఛమైన నీటిని అందించాలన్నారు. పూడిలంక గ్రామం చుట్టూ నీరు ఉంటుందని, రోడ్డు లేకపో వడంతో నీటిలోనే ప్రమాదకరంగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉందని, అందువల్ల బ్రిడ్జి నిర్మాణం చేయాలన్నారు. గత టీడీపీ హయాంలో రహదారి సగం వరకు నిర్మించామని, తరువాత వచ్చిన ప్రభుత్వం దాన్ని పూర్తి చేయ లేదన్నారు. వీటిపై కమిషనర్ సానుకూలంగా స్పదించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారని ఎమ్మెల్యే తెలిపారు.


విరాళాల చెక్కును సీఎం చంద్రబాబుకు అందిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

సీఎంఆర్ఎఫ్‌కు రూ.2.51 లక్షలు

పలాస, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.2.51 లక్షల చెక్కును సీఎం చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే గౌతు శిరీష అందించారు. ఈ మొత్తంలో మదర్‌థెరిసా విద్యాలయం చైర్మన్ వజ్జ గంగాభవాని రూ.లక్ష, సాయిశిరీష స్కూల్ ప్రిన్సిపాల్ కవిటి భారతి రూ. 50 వేలు, లయన్స్ క్లబ్ రూ.80 వేలు, రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది రూ. 21 వేలు అందించడంతో ఆ మొత్తం చెక్కును శనివారం విజయవాడలో సీఎంకు అందించారు.

ప్రగతి కోసం 'పల్లె పండగ': ఎమ్మెల్యే బగ్గు


జలుమూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


పలాస రూరల్: శంకుస్థాపనలో పాల్గొన్న ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు

జలుమూరు, (సారవకోట)/పోలాకి, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి) పల్లెలు ప్రగతి పథంలో నడిపించేందుకు గాను కూటమి ప్రభుత్వం 'పల్లె పండగ' నిర్వహిస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సారవకోట మండలం జమచక్రం, పోలాకి మండలం మబగాం, తలసముద్రం గ్రామాల్లో శనివారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చేపట్టనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ నేతలు ధర్మాన తేజకుమార్, కత్తిరి వెంకటరమణ, చిన్నికృష్ణంనాయుడు, కాయరవి, సర్పంచ్ పి.శాంతి, ఎంపీటీసీ భైరి వరలక్ష్మి, ఎంపీడీవో మోహనకుమార్, తహసీల్దారు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి: వజ్జ

పలాసరూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే పంచాయతీలు, గ్రామాలు అభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. శనివారం గరుడఖండి, లక్ష్మీపురం, పాతజగదేవపురం గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పీరికట్ల విఠల్, టీడీపీ నాయకులు దువ్వాడ సంతోష్‌కుమార్, బడ్డ నాగరాజు పాల్గొన్నారు.

'ఉపాధి' ఆడిట్‌కు పూర్తి సమాచారం

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీకి సంబంధించి నిర్వహించనున్న ఆడిట్‌కు పూర్తి స్థాయి సమాచారం అందించాలని ఎంపీడీవో రమేష్‌నాయుడు అన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

సెంచూరియన్ విద్యార్థులకు 'అదితం' ఉపకార వేతనాలు


ఉపకార వేతనాలను అందిస్తున్న సెంచూరియన్ ఉపాధ్యక్షుడు డీఎన్ రావు

నెల్లిమర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో అదితం లక్ష్మణరావు అండ్ శేషమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు డీఎన్‌రావు చేతుల మీదుగా వీటిని శనివారం పంపిణీ చేశారు. అదితం ట్రస్టు తరఫున ఈ ఏడాది ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న దున్న తేజ, ఫోరెన్సిక్ సైన్స్ విద్యార్థిని కంది లావణ్యలకు చెరో రూ.1.50 లక్షల ఉపకార వేతనం అందజేశారు. కార్యక్రమంలో చాన్సలర్ జీఎస్ఎన్ రాజు, రిజిస్ట్రార్ డా.పల్లవి, ప్రొఫెసర్ శాంతమ్మ, ఐక్యూ ఏసీ హెచ్ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్‌లు డా.సన్నిదయాల్, డా.విజయ్‌బాబు, డిప్యూటీ రిజిస్ట్రార్ డా.ఆర్ఎస్ వర్మ, బీబీఏ విభాగం అధిపతి డా.మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలను అడ్డుకోవాలి

కొత్తూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడుం గ్రామంలో ప్రభుత్వ అధీనంలో ఉన్న సలాన్ని కొందరు తప్పుడు ధ్రువపత్రాలతో ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ రవిచంద్రకు ఫిర్యాదు చేశారు. ఈ సదర్భంగా గ్రామస్థుడు వాసు మాట్లాడుతూ.. ఎంతో విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణలకు పాల్పడడం అన్యాయమన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎంపీటీసీ గోవిందరావు, ఆదినారాయణ, రవి తదితరులున్నారు.